# జిందాల్ స్టీల్ ప్లాంట్‌కు వైఎస్ జగన్‌నే శ్రీకారం చుట్టారు

## కడప ద్రోహి అనడం సిగ్గుచేటు: రెద్యం



**చాపాడు,జూన్30.అక్షరటైమ్స్:** జిందాల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేసి, ప్రాజెక్టు అమలుకు అవసరమైన భూములు, మౌలిక సదుపాయాలు కల్పించి కడప జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేసిన నాయకుడని, అలాంటి నేతను "కడప ద్రోహి"గా అభివర్ణించడం సిగ్గుచేటని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెద్యం వెంకటసుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం చాపాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూలై 3న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిందాల్ స్టీల్ ప్లాంట్‌కు మరోసారి భూమిపూజ చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికే 2023 ఫిబ్రవరి 15న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా భూమిపూజ చేసి, ప్రాజెక్టు అమలుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. జిందాల్ స్టీల్ ప్లాంట్ కోసం సుమారు 3,500 ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు నీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. జిల్లాలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎలాంటి పారిశ్రామిక పురోగతి లేకుండానే కేవలం శిలాఫలకానికే పరిమితమైందని, ఇప్పుడు వైఎస్ జగన్ ప్రారంభించిన ప్రాజెక్టుకు మరోసారి భూమిపూజ చేసి తమ ఘనతగా ప్రచారం చేసుకోవడం "క్రెడిట్ చోరీ" కాదా అని ప్రశ్నించారు. వాస్తవాలను మరుగునపెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించిన రెద్యం వెంకటసుబ్బారెడ్డి, జిల్లా అభివృద్ధి కోసం కృషి చేసిన వైఎస్ జగన్‌ను కడప ద్రోహిగా వ్యాఖ్యానించిన టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, జిందాల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటులో వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలు గుర్తుంచుకున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను మార్చే ప్రయత్నాలను జిల్లా ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని ఆయన అన్నారు.




# శ్వాసను నిలిపే శ్వేత సైనికులకు సలాం : బొల్లు రామమోహన్

**పోరుమామిళ్ల,జూన్30.అక్షర టైమ్స్:-** ఒక ప్రాణం భూమి మీదకు రావాలన్నా..ఉన్న ప్రాణం నిలబడాలన్నా..ఆ బ్రహ్మ దేవుడి తర్వాత మళ్లీ ఆ చేతులే కావాలి. స్టెతస్కోపును ఆయుధంగా చేసుకొని, తెల్లని కోటును కవచంగా తొడుక్కొని సమాజ ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమించే వైద్యులందరికీ జాతీయ డాక్టర్ల దినోత్సవ శుభాభినందనలు.

**జాతీయ డాక్టర్ల దినోత్సవ నేపథ్యం**

భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై ఒకటవ తారీఖున 'జాతీయ డాక్టర్ల దినోత్సవం' అత్యంత ఘనంగా జరుపుకుంటారు. ప్రముఖ వైద్యుడు, స్వాతంత్ర సమరయోధుడు మరియు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి అయిన డాక్టర్ బిధాన్ చంద్రరాయి (బి.సి. రాయ్) జన్మదినం మరియు వర్ధంతి ఒకే రోజు (జూలై 1) కావడం విశేషం. సమాజానికి ఆయన అందించిన అసమాన సేవలను స్మరిస్తూ, గౌరవార్థం ఈ రోజును డాక్టర్ల దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.

**నడిచే దైవం..వైద్యుడు**

"వైద్యో నారాయణో హరిః" అంటే వైద్యుడు దేవునితో సమానం. దేవుడు ప్రాణం పోస్తే... ఆ ప్రాణానికి వచ్చే ప్రతి ముప్పును ఎదుర్కొని, కంటికి రెప్పలా కాపాడే నడిచే దైవం వైద్యుడు. గుడిలో ఉన్న దేవుడిని మనం కళ్ళతో చూడలేకపోవచ్చు, కానీ ఆపదలో ప్రాణాలు నిలిపే వైద్యుడి రూపంలో ఉన్న దైవాన్ని మనం ప్రతిరోజు చూస్తూనే ఉంటాం. రోగుల ఆరోగ్యమే తమ ధ్యేయంగా భావించి, పగలు రాత్రి తేడా లేకుండా సేవ చేయడం వైద్య వృత్తి యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తుంది.

**నిద్రలేని రాత్రులు... నిలకడైన శ్వాసలు**

వైద్యులు తమ జ్ఞానం, నైపుణ్యం మరియు అంకితభావంతో అనేకమంది ప్రాణాలను కాపాడుతూ సమాజానికి అమూల్యమైన సేవలు అందిస్తున్నారు. కంటినిండా నిద్రను సైతం త్యాగం చేసి... ఎదుటివారి గుండెల్లో నిబ్బరాన్ని, పేదవారి పెదవులపై చిరునవ్వును నింపే నిరంతర శ్రామికుడు వైద్యుడు. వారి త్యాగం, సేవాభావం మానవత్వానికి నిలువెత్తు ప్రతీకలు.

**స్టెతస్కోప్: ఒక నమ్మకమైన బంధం**

వైద్యుడి మెడలోని స్టెతస్కోప్ కేవలం ఒక పరికరం కాదు, అదొక నమ్మకమైన బంధం. రోగి గుండె చప్పుడును కేవలం వినడమే కాదు... ఆ చప్పుడు వెనుక ఉన్న ఆందోళనను, భయాన్ని కనిపెట్టి, ప్రాణాన్ని నిలబెట్టే మంత్రదండం ఆ స్టెతస్కోప్.

**ఆధునిక కాలపు సంజీవని**

రామాయణంలో లక్ష్మణుడి ప్రాణం కాపాడడానికి హనుమంతుడు సంజీవని మూలికను తెచ్చాడు. నేడు ప్రతి ఆసుపత్రిలోనూ, ప్రతి పేదవాడి ప్రాణాన్ని కాపాడడానికి మన డాక్టర్లు ఆధునిక కాలపు సంజీవనిలా మారుతున్నారు. విపత్కర పరిస్థితులు, అంటువ్యాధులు దేశాన్ని చుట్టుముట్టినప్పుడు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, సమాజాన్ని ముందుండి నడిపించేది వీరే.

**ముగింపు**



వైద్య వృత్తి అనేది కేవలం ఒక వ్యాపారం కాదు, అదొక నిరంతర జీవన యజ్ఞం. డాక్టర్ల దినోత్సవం సందర్భంగా ప్రతి వైద్యుడి సేవలను గౌరవంగా స్మరించుకోవడం మన బాధ్యత. సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తూ, మానవ సేవలో తరిస్తున్న ప్రతి ఒక్క డాక్టర్కు శిరస్సు వంచి నమస్కరిస్తూ... శ్వేత సైనికులకు సలాం!

# జూనియర్ అసిస్టెంట్ దాసిరెడ్డి పదవీ విరమణ



**వేంపల్లె,జూన్30.అక్షర టైమ్స్:-** స్థానిక పట్టణంలోని శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. దాసిరెడ్డి మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యాలయ ఆవరణలో దేవస్థానం పాలకమండలి చైర్మన్ పీవీ. రమణ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దేవస్థానం పాలకమండలి చైర్మన్ పీవీ రమణ మాట్లాడుతూ దాసిరెడ్డి దేవస్థానానికి అందించిన సేవలను కొనియాడి, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సుభాష్, దేవస్థానం మాజీ చైర్మన్ ఎం. శివారెడ్డి, అర్చకులు తిరుమల వేణుస్వామి, ఆలయ పాలకమండలి సభ్యులు అద్దంకి రామయ్య, కోనేటి రాజమ్మ, నాగిశెట్టి సునీల్, జూటూరి జ్యోతి, వరాలు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ కమిటీలకు దరఖాస్తుల స్వీకరణ





## కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాల నాయకులు, జనసైనికుల నుంచి దరఖాస్తులు

**కడప,జూన్30.అక్షర టైమ్స్:-** జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కడప పార్లమెంటు జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీ పరిశీలకులు చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కడపలోని హరిత హోటల్‌లో కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాల పార్టీ నాయకులు, జనసైనికుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జనసేన పార్టీ కమిటీల్లో బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ దరఖాస్తులను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కడప పార్లమెంటు పరిధిలో గ్రామ స్థాయి నుంచి పార్లమెంటు స్థాయి వరకు పార్టీని మరింత పటిష్టం చేసేందుకు సమాచార సేకరణ, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టినట్లు చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ప్రతి కార్యకర్తకు సమాన అవకాశం కల్పించడమే జనసేన పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం మైదుకూరు నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు జీ.సి. కృష్ణమూర్తి మాట్లాడుతూ తమ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో జనసేన సైనికులు, వీర మహిళలు పాల్గొని దరఖాస్తులు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు గోశెట్టి రామగోవిందు, దండు శ్రావణ్ కుమార్, పుల్లయ్య, మేకల విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు మరో రెండు నెలల నిషేధం

## ఉపమత్య సంచాలకులు నాగయ్య



**బ్రహ్మంగారిమఠం,జూన్30.అక్షర టైమ్స్:-** వైఎస్సార్ కడప జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులు, బ్రహ్మసాగర్ జలాశయం మరియు సోమశిల పెన్నా జలాశయంలో చేపల సంతానోత్పత్తి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపల వేటపై విధించిన నిషేధాన్ని ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు (మొత్తం 62 రోజులు) చేపల వేట పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఉప మత్స్య సంచాలకులు తెలిపారు. ఈ నిషేధ కాలంలో ఎలాంటి వ్యక్తి లేదా జాలరి చేపల వేట నిర్వహించినా సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు జిల్లాలోని మత్స్యకారులు, లైసెన్స్‌దారులు మరియు ప్రజలు నిషేధాన్ని పూర్తిగా పాటించి అధికారులకు సహకరించాలని మరియు అతిక్రమించిన వారిపై చట్టపర మైన చర్యలు తీసుకోబడునని ఉప మత్స్య సంచాలకులు విజ్ఞప్తి చేశారు.

# సింగరాయ స్వామి దేవస్థాన పునర్నిర్మాణ పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానం



**బ్రహ్మంగారిమఠం,జూన్30.అక్షర టైమ్స్:-** బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లాయపల్లెలోని శ్రీ కొండ సింగరాయ స్వామి దేవస్థానంలో చేపట్టనున్న పునర్నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని దేవస్థాన ధర్మకర్తల మండలి విజ్ఞప్తి చేశారు. దేవస్థాన పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు జూలై 2, 2026 గురువారం ఉదయం 10 గంటలకు దేవస్థాన ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ , దేవదాయ శాఖ , పోలీస్ సంబంధిత అధికారులు ,భక్తులు సమక్షంలో పునర్నిర్మాణ పనుల ప్రారంభమవుతాయని వారు తెలిపారు. అనంతరం పంచనామ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు. వారు తెలిపారు.దేవస్థానం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజ్ఞప్తి చేశారు.

# ఎస్సీ,ఎస్టీ,బీసీ కాలనీలలో స్మశానవాటికలు ఏర్పాటు చేయాలి



**బద్వేల్, జూన్ 30. అక్షర టైమ్స్:-** బద్వేలు రూరల్, గోపవరం మండలాలలో ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ కాలనీలలో స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ బద్వేల్ రూరల్ కార్యదర్శి డి వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం బద్వేల్ పట్టణంలోని రాఘవేంద్ర కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రత్యేక రెవెన్యూ సదస్సులో హాజరైన బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ కు బద్వేలు రూరల్ గోపవరం గ్రామాలలో ఉన్నటువంటి స్మశానవాటికలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం బద్వేల్ రూరల్ కార్యదర్శి డి.వెంకటేష్ మాట్లాడుతూ బద్వేల్ మండలంలోని పది పంచాయతీలు 15 దళిత గ్రామాలు గోపవరం మండలంలోని ఏడు పంచాయతీలలో పది దళిత గ్రామాలకు గాను వివిధ గ్రామాలలో స్మశాన వాటికలు లేక ఎస్సీ ఎస్టీ బీసీ ల దళిత కాలనీలలో వర్షాకాలం లో రహదారులు లేక నడుము లోతు నీళ్లలో పూడ్చుకునే పరిస్థితి దళిత గ్రామాల్లో ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని ఎస్సీ,ఎస్టీ,బీసీ కాలనీలలో స్మశానవాటికలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్ రాంబాబు, శివకుమార్,రామకృష్ణ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువుల వాడకం తగ్గించిది సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి పొందవచ్చు



**నందవరం,జూన్30.అక్షర టైమ్స్:-** ముగతి రైతు సేవ కేంద్రంలోమండల వ్యవసాయ అధికారి మరియు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. రైతులు ప్రకృతి సేద్యంతోనే లాభదాయకమైన పంటలు పండించవచ్చు అని డిఆర్సి ఏవో సరిత అన్నారు. మంగళవారం ముగతి రైతు సేవ కేంద్రంలో రైతులకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులైన నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అజ్ఞాస్త్రం, జీవామృతం వంటి కషాయాలు సొంతంగా తయారు చేసుకునే విధానం రైతులకు వివరించారు. అలాగే పంట మార్పిడి, కంచ పంట, అంతర్ పంట ,ఎరువుల యాజమాన్య పద్ధతులు,50 నుంచి 60,ఎమ్ ఎమ్ వర్షపాతం పడిన తర్వాత మాత్రమే రైతులు విత్తనాలను విత్తుకోవాలని ఎల్ ని నో ప్రభావం ఉండడం వలన స్వల్పకాలిక, బెట్టాను తట్టుకొనే రకాలను విత్తుకోవాలని, భూసార పరీక్ష ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో , వ్యవసాయ అధికారి సరిత,విఎఎ ప్రశాంతి ,జెడ్బిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఉషాకిరణ్ హైస్కూల్ విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపిక

## కరస్పాండెంట్ బిఎస్. రమణారెడ్డి



**వేంపల్లె,జూన్30.అక్షర టైమ్స్:-** స్థానిక పట్టణంలోని ఉషాకిరణ్ హైస్కూల్ విద్యార్థిని షేక్. ఆఫ్నాన్ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్. రమణారెడ్డి తెలిపారు. పదోతరగతి ఫలితాల్లో 592 మార్కులతో విద్యార్థిని ఆఫ్నాన్ ప్రతిభ చూపి ట్రిపుల్ ఐటీ ప్రవేశానికి ఎంపికైంది. దీంతో ఆ పాఠశాల కరస్పాండెంట్‌తో పాటు ఉపాధ్యాయుల బృందం హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

# భూ సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న డీసీసీబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి

**బద్వేల్,జూన్30.అక్షర టైమ్స్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా మంగళవారం బద్వేలు టౌన్‌లోని రాఘవేంద్ర గ్రాండ్ లో భూ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ శ్రీ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గత మూడు పర్యటనలలో నమోదైన అర్జీలను అధికారులు వేగవంతంగా పరిష్కరించి, అర్జీదారులకు ఎండార్స్మెంట్లు అందజేశారు. ఈ ఎండార్స్మెంట్లు డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి , జాయింట్ కలెక్టర్ నిధి మీనన్, ఆర్డీవో చంద్రమోహన్ చేతుల మీదుగా అందించబడ్డాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం కావడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, బద్వేలు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు






అధికంగా ఉన్నాయని, వాటిని దశలవారీగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదులను నిర్దిష్ట గడువులో పరిష్కరించే దిశగా అధికారులు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

## ప్రిన్సిపాల్ డా"ఉషశ్రీ

**వేంపల్లె,జూన్30.అక్షర టైమ్స్:-** స్థానిక పట్టణంలోని వై.ఎస్.ఆర్. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ తెలిపారు. కళాశాలలో సింగిల్ మేజర్ విధానంలో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. బి.ఏ. (మేజర్) చరిత్ర, బి.కాం. కంప్యూటర్ అప్లికేషన్స్, బి.ఎస్సీ. (మేజర్) రసాయన శాస్త్రం, బి.ఎస్సీ. (మేజర్) కంప్యూటర్ సైన్స్, బి.ఎస్సీ. (మేజర్) గణిత శాస్త్రం కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, టి.సి. తదితర ధ్రువపత్రాలతో కళాశాల కార్యాలయంలో సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ ఉషశ్రీ తెలిపారు.




# విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

## డిఆర్‌ఓ కు యుటిఎఫ్ జిల్లా శాఖ వినతి

**బద్వేల్,జూన్30.అక్షర టైమ్స్:-** విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిఆర్ఓ మల్లికార్జునుడు కు యుటిఎఫ్ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఉదయం కడపలోని జిల్లా కలెక్టరేట్లో విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యలపై డిఆర్ఓ మల్లికార్జునుడుకు యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ విద్యా రంగ, ఉపాధ్యాయుల పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. 2025 సంవత్సరములో బదిలీ కాబడిన కొందరు ఉపాధ్యాయులు రిలీవర్ లేని కారణంగా పాత పాఠశాలలోనే కొనసాగుతున్నారన్నారు. ప్రస్తుతం విద్యాశాఖ చేపట్టిన పని సర్దుబాటు ప్రక్రియకు ముందుగానే వారిని రిలీవ్ చేసి వారు కోరుకున్న స్థానాలకు పంపాలన్నారు. ఈ ఏడాది విద్యాశాఖ చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియకు కట్ ఆఫ్ తేదీని జూన్ 20 వ తేదీగా నిర్ణయించడం వల్ల, ఆ తర్వాత పాఠశాలల్లో పెరిగిన అడ్మిషన్లు పరిగణలోకి రాకపోవడం మూలాన పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. జూన్ 30వ తేదీని ఆధారంగా తీసుకొని రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 45 ప్రకారం ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో ఉన్న లోపాలను పూర్తిస్థాయిలో సవరించి, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అప్పటికి ఉన్న సమస్యలను



పరిష్కారం చేసి తర్వాత ఆమోదానికి పంపాలన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో నాన్ లోకల్ కేటగిరీలో సెలెక్ట్ అయి సొంత జిల్లాలోకి వెళ్లాలనుకున్న వారికి అంతర్ జిల్లా సాధారణ బదిలీలు నిర్వహించి సొంత జిల్లాలకు వెళ్లే అవకాశం కల్పించాలని కోరారు. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యా హక్కు చట్టం 23 (1) కి సవరణ చేయాలన్నారు. చట్ట సవరణ చేసే వరకు ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ పరీక్షలను ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలని కోరారు. గత ఏడాది ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించబడిన పాఠశాలలకు పలుచోట్ల తగినంత స్థలము లేక , తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాంటి పాఠశాలలకు తగినంత స్థలము ఏర్పాటు చేయడంతో పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణము చేపట్టాలన్నారు. సమగ్ర శిక్ష, కస్తూర్బా లలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయినీలు, సిఆర్ఎంటి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు మరియు ఇతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు దశలవారీగా వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులను త్వరిత గతిన మంజూరు చేసి, నగదు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాలుగు సంవత్సరాలుగా చెల్లింపులకు నోచుకోక పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులను చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 12వ పిఆర్సీ కమిషన్ ఏర్పాటు, 29 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ డిఏ ల విడుదల చేయాలని, ఆర్థిక బకాయిల చెల్లింపు వంటి వాటిపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల గ్రాంట్లను గత సంవత్సరం 50 శాతం మాత్రమే విడుదల చేశారని, ఈ సంవత్సరమైనా పూర్తిస్థాయిలో పాఠశాల అభివృద్ధి నిధులను మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మనబడి మన భవిష్యత్తు (నాడు-నేడు) లో భాగంగా గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన తరగతి గదులను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మల్లికార్జునుడు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు సానుకూలంగా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

# జనసేన పార్టీ కమిటీ పదవులకు దరఖాస్తుల స్వీకరణ

## దరఖాస్తులు స్వీకరిస్తున్నబి

## నిర్మాణ సారధుల కమిటీ సభ్యులు దాసరి రవిశంకర్



**కడప,జూన్30.అక్షర టైమ్స్:-** జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కడప పార్లమెంటు జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్మాణ సారధుల కమిటీ సభ్యులు దాసరి రవిశంకర్ తెలిపారు. కడప పార్లమెంటు జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీ పరిశీలకులు చిలకం మధుసూదన్ రెడ్డి సమక్షంలో కడప పట్టణంలోని హరిత రెస్టారెంట్‌లో పార్టీ కమిటీ పదవులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం కమలాపురం నియోజకవర్గం, మధ్యాహ్నం మైదుకూరు నియోజకవర్గాలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నారని తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు బలమైన కమిటీల ఏర్పాటు అవసరమని, ఆసక్తి ఉన్న నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దాసరి రవిశంకర్ కోరారు. పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల వారీగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంటు కమిటీ సమాచార సారధులు నందకిశోర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## గురువుల సేవకు గౌరవ వందనం

## సేవ కాలం ముగిసిన సమాజ సేవ

## కొనసాగిస్తాం ఉపాధ్యాయుల సందేశం

## విద్యా ప్రస్థానానికి ఘనంగా ముగింపు

## గురువులకు సన్మాన వర్షం

# తీరం దాటిన విద్యకిరణం

**ఆదోని,జూన్30.అక్షర టైమ్స్:-** ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ కోటపాట వెంకటస్వామి, ఉపాధ్యాయుడు శ్రీ వై సుబ్బారెడ్డి పదవి విరమణ సభ మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పండుగ వాతావరణంనెలకొన్నది. ఈ కార్యక్రమం డిప్యూటీ డీఇవో రాజేంద్రప్రసాద్, ఎంఈఓ రంగన్న, సమక్షంలో పదవి విరమణ సభ కొనసాగించారు. ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ కోటపాట వెంకటస్వామి, ఉపాధ్యాయుడు శ్రీ వై వెంకట సుబ్బారెడ్డి ఇద్దరికీ శాల్వాలు కప్పి పూలమాలతో సన్మాన కార్యక్రమం డిప్యూటీ డిఇఓ రాజేంద్రప్రసాద్, ఆదోని ఎంఈఓ రంగన్న, ఆదోని డివిజన్ ఎంఈఓ లు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు, మాజీగ్రామ సర్పంచ్ పార్వతి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు శివప్ప, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సన్మాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ




కోటపాట వెంకటస్వామి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తన జీవిత లక్ష్యమని తెలిపారు. తన సేవా కాలంలో సహకరించిన విద్యాశాఖ అధికారులు, సమాచార ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. పదవి విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమేనని సమాజ సేవకు కాదని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుడు శ్రీ వై సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. వేలాదిమంది విద్యార్థులను తీర్చదిద్దడమే తన జీవితంలో గొప్ప అదృష్టమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నంత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సహచర ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామ ప్రజలు ప్రేమభిమానాలు జీవితాంతం మరువలేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఇద్దరు ఉపాధ్యాయులు విద్య రంగానికి అందించిన సేవలు చిరాస్మరణీయమని కొనియాడారు. అనంతరం వారిని శాలువాలు పూలమాలలు జ్ఞాపకాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు తమ గురువులను సన్మానించి భావోద్వేగానికి గురయ్యారు. సభ అప్యాయత, అనుబంధాల మధ్య హర్షాతిరేక వాతావరణం లో సాగింది. ఈ కార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు,తల్లిదండ్రులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జహంగీర్ యువసేన ఆధ్వర్యంలో నేడు సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు



**బద్వేల్,జూన్30.అక్షర టైమ్స్:-** జహంగీర్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్ భాష తెలిపారు.ఈ సందర్భంగా జహంగీర్ భాష మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కావున బద్వేల్ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు,సూర్యనారాయణ రెడ్డి అభిమానులు అందరూ ఎన్జీవో కాలనీలోని సూర్యనారాయణ రెడ్డి కార్యాలయంలో సాయంత్రం జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

# అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే పార్థసారధి





**ఆదోని,జూన్30.అక్షర టైమ్స్:-** ఆదోని పట్టణంలో నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల శిక్షణా మరియు సమీక్ష సమావేశంలో ఆదోని ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి వాల్మీకి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, పోషకాహార కల్పన, ప్రాథమిక విద్యా వికాసంలో అంగన్‌వాడీ కార్యకర్తల సేవలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారునికి సమర్థవంతంగా చేరవేయడంలో అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధి, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సేవలు అందేలా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కోరారు. విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని వారు హామీ ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు అడిగిన పలు సందేహాలకు ఎమ్మెల్యే సమాధానాలు ఇచ్చి, వారి సమస్యలు, సూచనలను ఓర్పుగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో దీలేశ్వరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సహాయకులు, ఐసీడీఎస్ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐపిసి ఓబిసి జాతీయ కార్యదర్శి గా వీర భాస్కర్



**మదనపల్లె,జూన్30.అక్షర టైమ్స్:-** ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేనేత, ఓ బి సి జాతీయ కార్యదర్శి గా ఓర్సు వీర భాస్కర్ ని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీధర్ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేనేత, ఓ బి సి జాతీయ కార్యదర్శి ఓర్సు వీర భాస్కర్ మాట్లాడుతూ చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ స్థానిక సంస్థల్లో 35 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఓబీసీ సెమినార్ ను నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో చట్టసభల్లో కూడా ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ఓబీసీ వర్గాల నుంచి దేశవ్యాప్తంగా ఒత్తిడి పెరుగుతుందని, ప్రధాని మోదీ సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీలో స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సీఎం చంద్రబాబు కేంద్రం మీద ఒత్తిడి తీసుకుని రావాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరిలో ఏపీ, రాష్ట్రంలోని వేర్వేరుగా చట్టసభల్లో రిజర్వేషన్లు తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మాజీఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి స్ఫూర్తితో అంతక్రియలకు ఆర్థిక సాయం

## ఆపదలో అండగా దానంలో కర్ణుడుగా మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి స్ఫూర్తితో ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్సీపీ: కాంట్రాక్టు బసవరాజ్



**ఆదోని,జూన్30.అక్షర టైమ్స్:-** ఆదోని మండలం పెద్ద తుంబళం గ్రామం హరిజనదేవదాస్ వయసు 50 సంవత్సరాలు అనారోగ్యంతో మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న వైయస్సార్సీపి నాయకుడు కాంట్రాక్ట్ బసవరాజు వైఎస్ఆర్సిపి కార్యకర్తలతో కలిసి హరిజన దేవదాస్ పార్థదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి. వారి కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్సిపి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైయస్సార్సీపి నాయకుడు కాంట్రాక్ట్ బసవరాజు మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి స్ఫూర్తితో హరిజన దేవదాసు అంతక్రియలకు 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు . ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, కష్ట సమయంలో ఆదుకోవడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే స్పందించి నాయకుడిగా కాంట్రాక్ట్ బసవరాజు గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన చేసిన సాయం బాధ్యత కుటుంబానికి ఎంతో ఊరట నిచ్చిందని తెలిపారు. సామాజిక సేవ కార్యక్రమంలో ఎప్పుడు ముందుండే కాంట్రాక్ట్ బసవరాజు, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తూ ప్రజల మన్నులను పొందినారు. ఆయన సేవ భావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. గ్రామంలో మానవత్వం చాటుకున్నారు హరిజన దేవదాసు కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి కి, వైయస్సార్సీపి నాయకుడు కాంట్రాక్ట్ బసవరాజు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కే రామిరెడ్డి, మస్తాన్, గౌరవ తిక్కయ్య, హనుమంతు, రాజు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.